సాక్షి
చిత్తూరు
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



భయం వద్దు.. అప్రమత్తతే హద్దు
నెల్లూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ సోకడంతో జిల్లా అధికారులు అప్రమత్తమై వినియోగదారులకు సూచనలు చేశారు. - 8లో



టీడీపీ కీచక నేతను శిక్షించాలి
బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన టీడీపీ కీచక నేతను శిక్షించాలని మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి పేర్కొన్నారు. - 8లో



బ్రహ్మోత్సవం విజయవంతం చేద్దాం
శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ చైర్మన్ అంజూరు పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

ఆరు గ్రామాల్లో ఆరోగ్య సురక్ష

చిత్తూరు రూరల్: జిల్లాలో బుధవారం ఆరు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాలకు మొత్తం 2777 మంది రాగా, పీహెచ్‌సీ డాక్టర్లు ఆరుగురు, స్పెషలిస్ట్ డాక్టర్లు 11 మంది చికిత్స చేసి మందులు మాత్రలు ఇచ్చారు. జనరల్ ఓపీ 1143, గైనిక్ 429, చిన్న పిల్లల ఓపీ 119, ఆర్థో 525, డెంటల్ 45, చర్మ సంబంధిత సమస్యలకు 156, కంటి సమస్యలు 307, ఇతర సమస్యలకు 53 ఓపీలు రాగా నలుగురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

టీటీడీకి కూరగాయల వితరణ



తిరుమల నిత్యాన్నదాన సత్రానికి కూరగాయలను పంపుతున్న వ్యాపారులు

పలమనేరు: పట్టణానికి చెందిన శ్రీవారి భక్తులు ఆధ్వర్యంలో స్థానిక జై సింగ్ అనే వ్యాపారి తమ మిత్రులతో కలసి పది టన్నుల కూరగాయలను టీటీడీ ప్రత్యేక వాహనంలో తిరుమల నిత్యాన్నదాన సత్రానికి బుధవారం తరలించారు. వాహనానికి పూజలు చేసి, గోవిందనామ స్మరణల మధ్య బండిని సాగనంపారు.

ల్యాబ్ టెస్టుల్లో నిర్లక్ష్యం వద్దు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: ల్యాబ్ టెస్టు నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు నివారణ పద్ధతులు, ల్యాబ్ పరీక్ష విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ల్యాబ్ టెస్టుల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కచ్చితమైన పరీక్ష వివరాలను అందజేయాలని చెప్పారు. తద్వారానే వ్యాధుల కట్టడి సులభతరమని చెప్పారు. అనంతరం మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు టెస్టుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, డీఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ మెటీరియల్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సెంటర్‌లో ఈ నెల 22న డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పవనకుమారి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పంపిణీ కార్యక్రమానికి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ అతిథిగా విచ్చేస్తారన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సేవాదృక్పథంతో ఉచితంగా మెటీరియల్‌ను అందజేస్తున్నట్లు చెప్పారు. మెటీరియల్ పొందే మొదటి 50 మంది అభ్యర్థులు టెట్ మార్కుల జాబితాతో పాటు టెట్, డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తు, 2 ఫొటోలతో బుధవారం ఉదయం కోచింగ్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. అదే విధంగా ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 9491844963ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఎన్నికలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిద్దాం




మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాను గత నెల 22న విడుదల చేసిన తర్వాత పలు అంశాలకు సంబంధించి దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఎన్నికల కమిషన్‌కు నివేదికలు పంపుతామన్నారు. అనుమతి పొందిన తర్వాత జాబితా విడుదల చేస్తామని తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, భాస్కర్, గంగరాజు, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారానికి దేశదిమ్మరులు

గోబెల్స్ ప్రచారంలో ఆరితేరిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు సంక్షేమ ప్రభుత్వంపై నిత్యం విషం చిమ్మేందుకు అడ్డదారిలో రంగం సిద్ధం చేసుకున్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక ఇలా దొడ్డిదారుల్లో వెళుతున్నారు. ఇప్పటికే తన అను'కుల' మీడియా ద్వారా విస్తృతంగా అబద్ధాలు వల్లె వేస్తున్న ఆయన అది ఏమాత్రం ప్రభావం చూపించడం లేదని భావించి రకరకాల విన్యాసాలకు తెరదీస్తున్నారు.

- సంక్షేమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు తెలుగుదేశం పన్నాగం
- ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేక బృందాల నియామకం
- ఒక్కొక్కరికి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 కూలి
- పక్క రాష్ట్రాల నుంచి కూడా 'పనోళ్లు' దిగుమతి
- విషప్రచారంతో పాటు విధ్వంసాలకూ కుట్ర!
- సోషల్ మీడియాలో సైతం టీడీపీ శ్రేణుల కుయుక్తులు
- ఖర్చుకు వెనుకాడకుండా భారీగా నిధుల సేకరణ



సాక్షి, తిరుపతి: ప్రజల విశేష జనాదరణ కలిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఢీ కొనడమే లక్ష్యంగా ఊరూరా దుష్ప్రచారానికి టీడీపీ అధినేత కుట్ర పన్నారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా కూలీలను నియమించుకుంటున్నారు. ఒక్కోనియోజకవర్గానికి ప్రత్యేక బృందాలను నియమించుకుంటున్నారు. ఈ పనికి స్థానికులు ముందుకు రాకపోతే పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వీరికి రోజుకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు చెల్లిస్తున్నారు. దీనికోసం భారీగా నిధులు సమీకరించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా నారాయణ విద్యాసంస్థల విద్యార్థులతో చంద్రబాబు అసత్య ప్రచారం చేయిస్తుండడం గమనార్హం.

అధికార పార్టీని దెబ్బతీసేందుకు ఆపసోపాలు..

ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీలో వణుకు మొదలైంది. వైఎస్సార్‌సీపీ చేపడుతున్న 'సిద్ధం' ఎన్నికలసభలకు వస్తున్న జనాదరణ చూసి ఉలిక్కిపడుతోంది. ఎలాగైనా అధికార పార్టీని దెబ్బతీయాలని కుట్రలు పన్నుతోంది. గతంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వెళ్లిన పాతకాపు నాయకులను కలిసి తిరిగి రావాలని ప్రాధేయపడుతోంది. వారి నుంచి స్పందన రాకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యతిరేకత ఉందని చూపేందుకు ఆపసోపాలు పడుతోంది.

ప్రతి జిల్లాకు సోషల్ మీడియా దుష్టకూటమి

వీరు కాకుండా టీడీపీలో అత్యంత నమ్మకంగా ఉన్న పార్టీ శ్రేణులతో ప్రతి జిల్లాలో ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేశారు. వీరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సేకరించారు. రోజూ ప్రభుత్వంపై వ్యతిరేక, టీడీపీ అనుకూల నినాదాలను వీరు సోషల్ మీడియాలో వైరల్ చేయాలి. వాటిని పార్టీ నాయకులు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో తిరిగి పోస్ట్ చేసేలా పన్నాగం పన్నారు. బురద చల్లే బ్యాచ్ ఖర్చుల కోసం టీడీపీ పెద్దఎత్తున నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నిధులను ఎన్‌ఆర్‌ఐలు, అమరావతికి చెందిన భూస్వాములు, కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి సేకరించినట్లు సమాచారం.

ఊరూరా తిరిగి బురద చల్లడమే పని !

ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేకంగా కూలీలను నియమించుకున్న టీడీపీ వారికి ఫీల్డ్ ఫోర్స్ అని పేరుపెట్టింది. వీరిపైన బ్రాంచ్ మేనేజర్, ఇద్దరు టీం మేనేజర్లు, నలుగురు గ్రూప్ కో–ఆర్డినేటర్లను నియమించింది. వీరంతా సైకిల్ పార్టీకి చెందిన వారే. వారు చెప్పినట్టు ఫీల్డ్‌ఫోర్స్ పనిచేయాలి. వీరు ముందుగా ఊరూరా తిరిగి సమాచారాన్ని సేకరించి రాష్ట్ర టీడీపీ కార్యాలయానికి పంపుతున్నారు. దాని ఆధారంగా క్షేత్రస్థాయిలో ఎలా దుష్ప్రచారం చేయాలో ఎప్పటికప్పుడు ఫీల్డ్‌ఫోర్స్‌కు సూచనలు, సలహాలు అందుతాయి. దీనికోసం రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఓ బృందం అందుబాటులో ఉంటుంది. వీరు టీం మేనేజర్లకు ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. బృందాలుగా ఏర్పాటైన ఫీల్డ్‌ఫోర్స్ జన సంచారం ఉన్న ప్రాంతాలకు చేరుకుని అక్కడ పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశానుసారం డ్రామా స్టార్ట్ చేస్తుంది. అది విష ప్రచారమైనా కావొచ్చు. విధ్వంసమైనా కావచ్చు. అది పైనుంచి వచ్చే ఆదేశాల మేరకు ఉంటుంది.

మరో 2వేల మంది టీడీపీ సానుభూతిపరులు

బెంగళూరు నుంచి వచ్చిన రెండు వందల మందే కాకుండా టీడీపీలో నమ్మకంగా ఉన్న పార్టీ శ్రేణులను జిల్లాకు రెండు వేల మంది చొప్పున ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. వీరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సేకరించారు. ప్రతి రోజూ ఒక్కో కార్యకర్త పేరుతో రోజూ నాలుగు సార్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తారు. వాటిని పార్టీ నాయకులు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్‌లో పోస్ట్ చేసి వైరల్ చేస్తారు.

కుప్పంలో ప్రారంభం

కుప్పం నియోజకవర్గంలో అన్నికులాల వారిని కలసి తాము నియమించిన బృందాలు రాష్ట్రప్రభుత్వంపై దుష్ప్రచారం చేయించేందుకు మొదలుపెట్టారు. ప్రతి కులానికి పదిమంది సభ్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఎన్నికలు ముగిసేంత వరకు ఆయా సామాజిక వర్గాల వారితో టచ్‌లో ఉండే విధంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం టీడీపీ ఫోరం పేరిట బెంగళూరు చెందిన 200 మందిని కుప్పానికి తీసుకొచ్చారు. వీరు ప్రతి బూత్‌లో పర్యటించి ప్రభుత్వంపై బురద చల్లేందుకు దుష్ప్రచారం చేస్తున్నారు.

రూ.338.87 కోట్లతో చిత్తూరు మున్సిపల్ బడ్జెట్

- అంచనాలను ఆమోదించిన మున్సిపల్ పాలకవర్గం



చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ 2024–25 సంవత్సరానికి గాను రూ.338.87 కోట్లతో రూపొందించిన బడ్జెట్ అంచనాలను పాలకవర్గం ఆమోదించింది. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశాన్ని మేయర్ అముద అధ్యక్షతన నిర్వహించారు. 2024 –25 ఆర్థిక సంవత్సరంలో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ప్రారంభ నిల్వ రూ.113.93 కోట్లు చూపించగా, సాధారణ రాబడులు, మూలధనం ద్వారా రూ.274.93 కోట్లు సమకూరుతుందని అంచనా రూపొందించారు. మొత్తం జమ కింద రూ.388.87 రావొచ్చని, ఇందులో రూ.265.36 కోట్లు ఖర్చులుగా చూపించారు. తుదిగా రూ.123.50 కోట్ల మిగులు ఉంటుందనే బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. బడ్జెట్ అంచనాల్లో సాధారణ నిధులకు సంబంధించి కార్పొరేషన్ సేవలు, నిర్వహణ వ్యయం పోను, అభివృద్ధి పనులకు నికరంగా రూ.61.95 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ కాలనీల అభివృద్ధికి రూ.9.29 కోట్లు (15 శాతం), ఎస్టీలకు రూ.4.64 కోట్లు (7.5 శాతం), స్త్రీ శిశు సంక్షేమం కోసం రూ.3.09 కోట్లు (5శాతం), దివ్యాంగుల సంక్షేమానికి రూ.1.65 కోట్లు (3 శాతం), గుర్తింపు పొందిన పేదలవాడలను అభివృద్ధి చేయడానికి రూ.24.78 కోట్లు (40 శాతం) ఖర్చు చేయనున్నట్లు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ వైద్యం



పుత్తూరులో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా, వైఎస్సార్ సీపీ శ్రేణులు

- త్వరలోనే నగరిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం
- అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా వెల్లడి

పుత్తూరు: రాష్ట్రంలోని ప్రతి పేదవాని ఇంటికి ప్రభుత్వ వైద్యం అందాలన్న లక్ష్యంతో నేటి జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. పుత్తూరు పట్టణ పరిధిలోని గోవింద పాళెం వద్ద రూ.80 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నేడు ప్రారంభించిన అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా గేట్‌పుత్తూరు ప్రజలు వైద్య సేవల కోసం రైల్వే గేట్‌ను దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి తొలగిపోయిందన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి 108, ఆరోగ్యశ్రీ పథకాలు ప్రజలకు అందించారని చెప్పారు. తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి 108ను మరింత విస్తృతం చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల పరిమితి నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ పేదలకు మరింత చేరువ చేశారన్నారు. నగరిలో 100 పడకల ఆస్పత్రిని రూ.5 కోట్లతో నవీకరించి సీఎం జగనన్న చేతుల మీదుగా ప్రారంభించినట్లు గుర్తు చేశారు. త్వరలోనే నగరిలో డయాలసిస్ సెంటర్‌ను సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరిలో ఇప్పటికే రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. పుత్తూరులో ప్రస్తుతం ఒకటి ప్రారంభించామని, మరో రెండు రోజుల్లో మరొకటి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. పుత్తూరులో 50 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉందన్నారు. రూరల్ ప్రాంతాల్లో అడిషినల్ పీహెచ్‌సీలను, మున్సిపాలిటీల్లో రెండేసి అర్బన్ హెల్త్ సెంటర్లను అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య పరీక్షలు చేయిస్తూ మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సింగిల్ విండో చైర్మన్లు నారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహ, రాధ, షకీలా, వహెస్సార్‌సీపీ నాయకులు జయబాబు, జయరామిరెడ్డి, కె.వెంకటేశ్‌రెడ్డి, ఈశ్వరయ్యయాదవ్, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, జయచంద్రన్, వెంకటేశన్‌రెడ్డి, విజయులురెడ్డి, గాంధీ, చక్రీ తదితరులు పాల్గొన్నారు.

చౌటూరు ప్రజల సమస్య పరిష్కారం



పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు: పట్టణ పరిధిలోని చౌటూరు గ్రామ ప్రజల దశాబ్దాల నాటి శ్మశాన వాటిక సమస్యను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పరిష్కరించారు. గ్రామానికి చెందిన 1.3 ఎకరాల శ్మశాన స్థలంలో తిరువట్టం ప్రాజెక్టు కారణంగా ఊట నీరు చేరిపోతుంటుంది. దీంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు జరిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల ఈ విషయాన్ని మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి శ్మశానం వద్ద ఉన్న మునీశ్వర ఆలయం సమీపంలోని కొంత భాగం వరకు మట్టితో చదును చేయడానికి నిర్ణయించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా 200 ట్రక్కుల మేర మట్టిని తోలి శ్మశానాన్ని బాగు చేయించారు. దీంతో గ్రామస్తులు మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ కె.భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కె.వెంకటేశ్‌రెడ్డి, శివారెడ్డి, బండారుపల్లి వెంకటేష్, మూర్తి, పవన్, సూర్య, మునివేలురెడ్డి, ఉమాపతి పర్యవేక్షించారు.

పది పరీక్షల అబ్జర్వర్‌గా శ్రీనివాసులురెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర సమగ్ర శిక్ష శాఖ ఏఎస్‌పీడీగా పనిచేస్తున్న కేవీ శ్రీనివాసులురెడ్డి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జిల్లా అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులు బుధవారం డీఈవో కార్యాలయానికి చేరాయి. ఆయన మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పర్యవేక్షిస్తారు.

డీఎస్సీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 25 వరకు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్: డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు డీఈవో దేవరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. అభ్యర్థుల కోరిక మేరకు ఈ నెల 22 వరకు ఉన్న గడువును ప్రభుత్వం పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. డీఎస్సీ వెబ్‌సైట్‌కు సర్వర్ సమస్య అని సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలు అవాస్తవమన్నారు. అలాంటి వార్తలను అభ్యర్థులు నమ్మవద్దని సూచించారు.

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి



గుడుపల్లె శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు



సమావేశంలో ప్రసంగిస్తున్న సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

గుడుపల్లె: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే సాంకేతిక విద్యను అందుపుచ్చుకోవాలని సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో ఎంపికైన 520 మంది ఉపాధ్యాయులకు బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఒక్కో బ్యాచ్‌కు 90 మంది చెప్పున 7 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా కిట్లను అందిస్తామన్నారు. ఈ కిట్లను పాఠశాల గదుల్లోని గోడలకు అతికించి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో దేవరాజ్, ఎస్ఎస్ఏ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ రవీంద్రనాథ్, కోఆర్డినేటర్ పుష్ప, రిసోర్స్ ట్రైనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో తెప్పపై గోవిందరాజస్వామి విహారం





తెప్పపై విహరిస్తూ భక్తులను కనువిందు చేస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

తిరుపతి కల్చరల్: గోవిందరాజ స్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పలపై కొలువుదీర్చి హారతులు సమర్పించారు. తెప్పలపై కొలువైన స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో ఏడు చుట్లు విహరించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తిరుమల చిన్నజీయంగార్ స్వామి, జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అపోలో గ్రాడ్యుయేషన్ డే



పట్టా అందజేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో మెడికల్ కళాశాలలో బుధవారం ఎంబీబీఎస్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌తో అనుబంధంగా ఉన్న ఏఐఎంఎస్ఆర్ రెండవ బ్యాచ్ విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేయగా, 146 మందికి అపోలో నిర్వాహకులు సంగీతారెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, శివరామకృష్ణన్, సుధాకర్ బాబు తదితరులు పట్టాలు అందజేశారు.

టీడీపీ కీచక నేతను కఠినంగా శిక్షించాలి

కుప్పం: మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన టీడీపీ నేతను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. రామకుప్పం మండలంలో లైంగిక దాడికి గురైన మైనర్ బాలికను బుధవారం ఆమె పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, బాలికపై పైశాచికంగా ప్రవర్తించిన వారిని ఉరి తీయాలంటూ తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. టీడీపీ పాలనలో అనంతపురం, సత్యసాయి జిల్లా వరుసగా జరిగినా సంఘటనలపై సంబంధిత వ్యక్తులను చంద్రబాబు వెనుకేసుకుని రావడంతో టీడీపీ నేతలు అగడాలు మితిమీరిపోయాయని చెప్పారు. అప్పట్లో తాము పోరాడినా చంద్రబాబు పట్టించుకోలేదని గుర్తుచేశారు. అయితే తాము మాత్రం బాధితుల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. ఆస్పత్రి వైద్యులు బాలికకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వందపడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ కుమారి, వైద్యులు శివప్రకాష్, సీడీపీఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.

భయం వద్దు.. అప్రమత్తతే హద్దు



బర్డ్‌ఫ్లూ.. ఈ పేరు చెబితేనే ప్రజలు హడలిపోతున్నారు. చికెన్ దుకాణం వైపు కన్నెత్తి చూడాలంటేనే జంకుతున్నారు. అప్రమత్తంగా ఉంటే నివారించవచ్చని పశుసంవర్థక శాఖాధికారులు చెబుతున్నారు. నెల్లూరు ఘటనతో జిల్లాలో పశుసంవర్థకశాఖ అప్రమత్తం అయ్యింది. అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, కోళ్లఫారాలను పరిశీలిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- నెల్లూరు ఘటనతో బెంబేలెత్తుతున్న జనం
- పౌల్ట్రీ రైతులకు పశు సంవర్థక శాఖ అవగాహన
- పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక వెటర్నరీ బృందాలు

చిత్తూరు రూరల్: జిల్లాను బర్డ్‌ఫ్లూ భయపెడుతోంది.. నెల్లూరులో బర్డ్‌ఫ్లూ సోకిందన్న వార్తలతో జనం ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పశుసంవర్థక శాఖ అప్రమత్తమైంది. నెల్లూరులో బర్డ్‌ఫ్లూ అని నిర్ధారణ కావడంతో ప్రభుత్వం యంత్రాంగాన్ని అలెర్ట్ చేసింది. ఈ వ్యాధి సోకిన కోళ్లు చనిపోవడమే కాదు.. వాటిని తిన్న మనుషులకు కూడా ఈ వ్యాధి సోకి, ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. దీంతో ఈ వ్యాధి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పశు సంవర్థక శాఖను ఆదేశించింది.

9.35 లక్షల కోళ్ల పెంపకం

జిల్లాలో లేయర్, బాయిలర్, లింగాపురం తదితర రకాలు కోళ్లు 9.35 లక్షల వరకు పెంచుతున్నారు. అలాగే మరో 6.5 లక్షల పెరటికోళ్ల పెంపకం సాగుతోంది. వి.కోట, పలమనేరు, బంగారుపాళెం, చిత్తూరు, పూతలపట్టు, చిత్తూరు రూరల్‌లోని మాపాక్షిలో అధికంగా కోళ్లు పెంచుతున్నారు. వీటి నుంచి సంవత్సరానికి 37,089 మెట్రిక్ టన్నుల కోడి మాంసం, 10,723 లక్షల కోడిగుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. ఈ ఉత్పత్తులను జిల్లాతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రానికి సరఫరా చేస్తున్నారు.

కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ లక్షణాలు

- కోడికి తలవాపు
- దగ్గు
- నీళ్లకారడం
- జలుబు
- విరేచనాలు
- గుడ్డు ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోవడం.
- వైరస్ సోకిన నాలుగు రోజుల్లో కోళ్లు చనిపోతాయి.

అవగాహన

బర్డ్ ఫ్లూపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పౌల్ట్రీ రైతులు, కోళ్ల ఫారాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. కోళ్ల ఫారాల్లోకి కొత్తవారిని అనుమతించవద్దని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందినే కొనసాగించాలని, వీరిని ఇతర ప్రాంతాలకు పంపించవద్దని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఫారాల్లోకి రాకుండా నిషేధించాలని సూచిస్తున్నారు. ఒకవేళ వాహనాలను పంపించాల్సి వస్తే విధిగా సోడియం క్లోరైడ్‌ను చల్లాలని స్పష్టం చేస్తున్నారు.

ప్రత్యేక టీమ్‌లు

బర్డ్ ఫ్లూపై పర్యవేక్షణకు జిల్లాలో పశు సంవర్థక శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశారు. ఇందులో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఆ శాఖ గ్రామ సహాయకులు ఉన్నారు. జిల్లాలో 31 బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ ఎక్కడైనా ఫారాల్లో కోళ్లు చనిపోతే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆందోళన వద్దు



బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన పని లేదు. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడా ఆ ఛాయలు లేవు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బర్డ్‌ఫ్లూ సోకకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కోళ్లకు ముందస్తుగా వ్యాక్సినేషన్లు వేయిస్తున్నాం. ఫారాల్లో కోళ్లకు నీటిలో బీ కాంప్లెక్స్, సిరప్ ఇవ్వాలని, బర్డ్‌ఫ్లూ సోకకుండా నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పౌల్ట్రీ రైతులకు సూచిస్తున్నాం. వలస పక్షుల వల్ల బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

-ప్రభాకర్, పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు, చిత్తూరు

ఉడికించి తినాలి



బర్డ్‌ఫ్లూ వచ్చిందని భయపడాల్సిన అవసరం లేదు. చికెన్‌కు దూరం కావాల్సిన అవసరం లేదు. కోడి మాంసాన్ని బాగా ఉడికించి తినాలి. అలాంటప్పుడు ఎలాంటి జబ్బులు రావు. నిర్లక్ష్యం చేస్తే ఫీవర్, దగ్గు, డయేరియా, గొంతు నొప్పి, జలుబు, తలనొప్పి, నీరసం, ఆయాసం, ఒళ్లు నొప్పులు వస్తాయి. అలాంటప్పుడు యాంటీవైరల్ డ్రగ్స్‌వాడాల్సి ఉంటుంది. ప్రభుత్వ వైద్యులను సంప్రదించి వైద్య సలహాలు తీసుకోవాలి.

-రవిరాజు, వైద్యనిపుణుడు, చిత్తూరు

మానవత్వానికి హద్దుల్లేవ్



సిరాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: దేశాలకు హద్దులున్నా మానవత్వానికి ఎలాంటి హద్దుల్లేవని మోటివేటివ్ స్పీకర్ బ్రదర్ సిరాజ్ అన్నారు. స్థానిక శ్రీవజ్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాఫల్యం పేరిట ధార్మిక సలహాలు కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. సిరాజ్ మాట్లాడుతూ, మనుషులంతా ఒక్కటేనని, అయితే మతాలు, జాతుల పేరిట అంతరాలు సృష్టించుకోవడం తగదన్నారు. ప్రపంచంలో అన్ని మతాల సారాంశం ఒక్కటేనన్నారు. ప్రతి ఒక్కరూ కృతజ్ఞతాభావం పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ, జీవితంపై విరక్తితో మరణించాలనుకునే వారు సైతం బ్రదర్ సిరాజ్ ఉపన్యాసాల వీడియోలు చూస్తే మనోధైర్యం వస్తుందని, మహోన్నత వ్యక్తుల ధార్మిక కార్యక్రమాలు సమాజంలో మార్పును తెస్తాయన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని హిందూ, ముస్లింల మతపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు జాఫర్, ఇస్మాయిల్, హైదర్,ముజ్జు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన జనం

రామకుప్పంలో వరుస చోరీలు

రామకుప్పం: మండలంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. ఆరిమానుపెంట, రాజుపేట గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. బాధితులు రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిమానుపెంటకు చెందిన సురేష్ ఉపాధి నిమిత్తం కర్నూలుకు వెళ్లాడు. అతని భార్య నదియా గ్రామంలో కూలిపనులు చేసుకుంటూ పిల్లలతో ఇక్కడే ఉంది. నదియా తల్లికి ఆరోగ్యం బాలేదని ననియాల గ్రామానికి ఆదివారం ఆమె వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయంటూ స్థానికులు నదియాకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన ఆమె ఇంటికి వచ్చి గమనించగా బీరువాలో సుమారు లక్ష రూపాయలు విలువ చేసే బంగారు నగలు, రూ.30 వేలు నగదు, పిల్లలకు సంబంధించిన ధృవీకరణపత్రాలు చోరీకి గురయ్యాయి. రాజుపేటకు చెందిన మాలిని ఆస్ట్రేలియాకు వెళ్లింది. మంగళవారం ఆమె ఇంట్లో రూ.1.6 లక్షలు విలువ చేసే బంగారు నగలు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు ఆమె సమీప బంధువు మహేష్ రెడ్డి రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రతిభ



పి.భార్గవి ఎ.భాస్కర్ వి.చంద్రమౌళి కె.శశిధర్

తిరుపతి ఎడ్యుకేషన్: కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ ఒక ప్రకటనలో తెలిపారు. పి.భార్గవి 485, ఎ.భాస్కర్ 458, వి.చంద్రమౌళి 440, కె.శశిధర్ 414 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 58.67 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

సారా ఊట ధ్వంసం



సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుడిపాల: మండలంలో 1200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేయడంతోపాటు 100లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. రాసనపల్లె పరిసర ప్రాంతంలోని వంకలో బుధవారం సారా తయారీ చేస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. అక్కడ 1200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 100లీటర్ల సారాను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు రాసనపల్లెకు చెందిన ప్రభు(30) పరారైనట్లు తెలియజేశారు. అతనిపై కేసు నమోదు గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో కానిస్టేబుల్స్ ఎబినేషన్, రామారావు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

టి.వడ్డూరు వీఆర్వో మృతి



సుధాకర్‌రెడ్డి(ఫైల్)

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు వీఆర్వో పూల సుధాకర్‌రెడ్డి(46) పట్టణంలో తాను ఉంటున్న ఇంట్లో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయాన్ని బుధవారం స్థానికులు తెలుసుకొని వారి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ములకలచెరువుకు చెందిన సుధాకర్‌రెడ్డి టి.వడ్డూరులో వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ భార్యతో కలసి పట్టణంలోని గాంధీనగర్‌లో కాపురముండేవారు. కుమార్తె పుట్టినరోజు కోసం తల్లి ములకలచెరువు వెళ్లింది. ఇంట్లో సుధాకర్ రెడ్డి ఒక్కడే ఉన్నాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం కుటుంబీకులు ఆయనకు ఫోన్‌చేయగా స్పందించకపోవడంతో వారు పక్కింట్లో వారికి ఫోన్ చేసి చెప్పారు. వారు ఇంటివద్దకు వెళ్లి కిటికీలో చూడగా సుధాకర్‌రెడ్డి మంచం కింద అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబీకులకు పోలీసులకు సమాచారమిచ్చారు. మంగళవారం రాత్రి ముక్కు, చెవుల్లో రక్తం వచ్చి విగతజీవిగా పడి ఉన్న ఆయన్ను ఇంటి యజమాని, కొందరు సహచరులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఆయన కొన్నాళ్లుగా రక్తపోటుతో బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు





వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, యాదమరి: టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సొంత మండలంలో కొందరు టీడీపీ నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పెద్దగొట్టిగల్లు పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుర్రప్ప, మునిశేఖర్, రమణ, రమేష్, గోపినాథరెడ్డికి జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి చేసిన అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నామని తెలిపారు. తమకు టీడీపీ హయాంలో కంటే ఈ ప్రభుత్వ పాలనలోనే అన్ని రకాల పథకాలు అందాయని చెప్పారు. తాము మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ శేఖర్, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, శ్రీనాథనాయుడు, కేశవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, జాకీర్, ఆనంద పాల్గొన్నారు.

యాదమరి మండలంలో..

యాదమరి: మండలంలోని టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బుధవారం మండలంలోని జంగాలపల్లె పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేశారు. పీసీ కండ్రిగ గ్రామంలో టీడీపీకి చెందిన దిలీప్ నాయుడు, బొమ్మన్‌చేనుకు చెందిన మునిరాజుల మండడి, గోవిందమండడి పార్టీలో చేరడంతో వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. విజయవంతం చేద్దాం



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి అందజేస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ముందుగా వేదపండితులు ఆహ్వాన పత్రికలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామన్నారు. అంకు రార్పణ మొదలుపెట్టి 16వ తేదీ ఏకాంతసేవ వర కు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కి ఆయన ఆహ్వాన పత్రిక, స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు మున్నారాయల్, బుల్లెట్ జయశ్యామ్, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు,అధికారులు పాల్గొన్నారు.

8న మహాశివరాత్రి వేడుకలు..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి జరగనుంది. 12 రోజుల పాటు జరిగే ఈ వేడుకలు 3వ తేదీన ప్రారంభం అవుతాయి. 3న కన్నప్ప ధ్వజారోహణం, 4న స్వామివారి ధ్వజారోహణం, 8న మహాశివరాత్రి, 9న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 10 స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, 11న సభాపతి కల్యాణం, 12న కైలాసగిరి ప్రదక్షిణ, 13న ధ్వజావరోహణం, 14న పల్లకీసేవ, 15న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 16న శాంతిఅభిషేకం నిర్వహించనున్నారు.

సత్యవేడు అభివృద్ధే అజెండాగా పని చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాను, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పని చేస్తామని, అందుకు వచ్చే ఎన్నికల్లో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, ప్రజాప్రతినిధులు పని చేయాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన నూకతోటి రాజేష్‌తో కలసి ఆయన వరదయ్యపాళెంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమన్వయ సమావేశంలో ఎంపీ ముందుగా నూతనంగా నియమితులైన సమన్వయకర్త నూకతోటి రాజేష్‌ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరగనున్నాయని తెలిపారు. అందువల్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఇప్పటికే ఎంపీ నిధుల ద్వారా సత్యవేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఒక్క సత్యవేడు నియోజకవర్గంలోనే 86 వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.2 వేల కోట్ల లబ్ధి ప్రస్తుత ప్రభుత్వంలో చేకూరిందన్నారు. పారిశ్రామికంగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సత్యవేడు నియోజకవర్గం చెన్నై-విశాఖపట్నం, చెన్నై-బెంగళూరు కారిడార్లలో కీలకం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మరి కొన్ని కీలక పరిశ్రమలు ఈ ప్రాంత శ్రీసిటీకి రానున్నట్లు తెలిపారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,676 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 99, తిరుపతి రూరల్ 61, పుత్తూరు 118, చిత్తూరు అర్బన్ 89, చిత్తూరు రూరల్ 66, మదనపల్లె 112, పీలేరు 62, పుంగనూరు పరిధిలో 247 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 738 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.14.49 లక్షలు, చౌర్యం కేసులు 116కు గాను రూ.1.49 వేలు జరిమానాతో కలిపి మొత్తం 854 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.15.98 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

